పూర్వ విద్యార్థుల సమ్మేళనం



హస్తినాపురం: వనస్థలిపురంలోని ప్రశాంతి విద్యానికేతన్ పాఠశాలలో చదువుకున్న 1995–96 పదో తరగతి విద్యార్థులు సోమవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. దాదాపు 20 ఏళ్ల తర్వాత ఒకరినొకరు కలుసుకుని ఆప్యాయంగా పలకరించుకున్నారు. అనంతరం నాటి ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చంద్రారెడ్డి, ఉపాధ్యాయులు పార్వతి, లక్ష్మీ, నాగభూషణం, సబితా, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

బాబుకు దళితరత్న అవార్డు



అవార్డు అందుకుంటున్న తొంట బాబు

మన్సూరాబాద్: సామాజిక జనజాగృతి సమితి అధ్యక్షుడు, తెలంగాణ దళిత సేన ప్రధాన కార్యదర్శి, శివగంగా కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు తొంట బాబుకు దళితరత్న అవార్డు వచ్చింది. సోమవారం కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డాక్టర్ అంబేడ్కర్ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని యునైటెడ్ ఫోరం ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అవార్డును అందజేసినట్లు తెలిపారు. ఈ అవార్డుతో బాధ్యత మరింత పెరిగిందన్నారు.

అక్బర్‌బాగ్ బీ-బ్లాక్‌లోకి జీహెచ్‌ఎంసీ కార్యాలయం

మలక్‌పేట: నల్లగొండ క్రాస్ రోడ్డు వికలాంగుల పార్కులో ఉన్న జీహెచ్‌ఎంసీ సర్కిల్–6 మలక్‌పేట కార్యాలయాన్ని అక్బర్‌బాగ్ డివిజన్ బీ-బ్లాక్‌లోకి తరలించారు. అక్బర్‌బాగ్ చౌరస్తా నుంచి ఆంధ్రాకాలనీ మీదుగా ఆస్మాన్‌గఢ్ వాటర్ వర్క్స్ ఆఫీస్ వైపు వెళ్లే దారిలో బీ-బ్లాక్ క్వార్టర్ నంబర్లు–3,5లో ఏర్పాటు చేశారు. పౌర సేవలు అందించేందుకు అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉంటారని డిప్యూటీ కమిషనర్ జయంత్ తెలిపారు.

రక్తదాన శిబిరానికి స్పందన

మన్సూరాబాద్: జీఎస్ఐ 175 వార్షికోత్సవాల్లో భాగంగా జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ (జీఎస్ఐటీఐ)లో సోమవారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమానికి జీఎస్ఐటీఐ హెడ్, డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ రవి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రక్తదానం ఎంతో మంది ప్రాణాలను కాపాడుతుందన్నారు. జీఎస్ఐటీఐ యువ శాస్త్రవేత్తలు స్వచ్ఛందంగా రక్తదాన శిబిరంలో పాల్గొనడం సంతోషకరమని పేర్కొన్నారు.

కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం ఏర్పాటుకు అనుమతించాలి



కలెక్టర్ కార్యాలయంలో దరఖాస్తు చేస్తున్న నాయకులు

మన్సూరాబాద్: ఎల్‌బీనగర్‌లో కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం ఏర్పాటుకు అనుమతించాలని బీసీ కులాల సమన్వయ వేదిక అధ్యక్షుడు బొమ్మ రఘురాం నేత, సోషల్ జస్టిస్ పార్టీ అధ్యక్షుడు చామకూర రాజు, కేవీగౌడ్, వేణు, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం దరఖాస్తు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎల్‌బీనగర్‌లోని జ్యోతిరావు పూలే, డా.బీఆర్.అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్, ప్రొ. జయశంకర్, శ్రీకాంత్‌చారి విగ్రహాలు సామాజిక న్యాయ స్ఫూర్తికి సంకేతంగా నిలిచాయని, వాటి పక్కనే కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి అనుమతించాలని కోరామన్నారు.

మూసీలో గుర్తు తెలియని మృతదేహం లభ్యం

చైతన్యపురి: మూసీలో ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. సోమవారం ఉదయం మూసీ నీటిలో మృతదేహం ఉన్నట్లు స్థానికుల సమాచారం మేరకు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీయించి ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. మృతుడి ఆధారాలు లభించలేదని సుమారు 40 ఏళ్లు ఉంటాయని పేర్కొన్నారు.

జనావాసాల నడుమ స్క్రాప్ దుకాణాలు!

- తరుచూ ప్రమాదాలు
- పట్టించుకోని అధికారులు



నాగోలు మమతనగర్‌లో కాలనీలో ఏర్పాటు చేసిన స్క్రాప్ దుకాణం



న్యూ సమతపూరి కాలనీలో..

నాగోలు: జనవాసాలు, కాలనీలకు దూరంగా ఏర్పాటు చేయాల్సిన పాత వస్తువులు విక్రయించే స్క్రాప్ దుకాణాలు కాలనీల నడుమ ఏర్పాటు చేస్తుండటంతో వేసవిలో అగ్ని ప్రమాదాలకు కారణమవుతాయి. ఎల్‌బీనగర్ సర్కిల్ పరిధిలో వివిధ కాలనీల్లో పదుల సంఖ్యలో స్క్రాప్ దుకాణాలు ఏర్పాటు చేశారు. కాలనీ సంక్షేమ సంఘాల నాయకులు జీహెచ్‌ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఎల్‌బీనగర్ పరిధిలోని కొత్తపేట, నాగోలు, మన్సూరాబాద్, చంపాపేట, లింగోజిగూడ, హస్తినాపురం, హయత్‌నగర్ ప్రాంతాల్లో స్క్రాప్ దుకాణాలు ఏర్పాటు చేశారు. ఆయా దుకాణాల వద్ద ఎలాంటి భద్రతా చర్యలు లేకపోవడంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు.

ఖాళీ సీసాలతో ప్రమాదం..

వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున్న పాత పేపర్లు, ప్లాస్టిక్ సామగ్రి, ఇనుప వస్తువులు, వివిధ రకాల వైర్లు, మద్యం సీసాలు ఇతర ప్రమాదకరమైన వస్తువులను నిల్వ చేస్తున్నారు. వేసవి కాలం కావడంతో అందులో ఉన్న ప్లాస్టిక్ సామగ్రి, పాత విద్యుత్ వైర్లలతో అగ్ని ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉంటుంది. ఈ క్రమంలో ఎల్‌బీనగర్ పరిధిలో వివిధ కాలనీల్లో ఇప్పటికే పలు అగ్ని ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. కాలనీలో ఏర్పాటు చేసిన స్క్రాప్ దుకాణాలను జీహెచ్‌ఎంసీ అధికారులు, అగ్ని మాపక అధికారులు స్పందించి కాలనీలు, జనవాసాలకు దూరంగా ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. నాగోలు సాయినగర్ కాలనీలో రోడ్డు నెంబర్–3లో జనవాసాల మధ్య ఏర్పాటు చేసిన స్క్రాప్ దుకాణంలో ప్రతి రోజు వివిధ ప్రాంతాల నుంచి మద్యం ఖాళీ సీసాలు తీసుకువచ్చి అక్కడ నిల్వ ఉంచి అక్కడ నుంచి డీసీఎంల ద్వారా ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. దీంతో మద్యం గాజు సీసాలు పగిలిపోయి ప్రమాదకరంగా మారుతున్నాయి.

ఎస్‌టీపీ ప్లాంట్‌కు స్థలం పరిశీలన



ప్లాంటు ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలిస్తున్న రాజశేఖర్‌రెడ్డి

లింగోజిగూడ: సరూర్‌నగర్ చెరువులో మురుగు నీరు కలువకుండా సీవరేజీ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని లింగోజిగూడ డివిజన్ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. సోమవారం ప్రాజెక్టు చీఫ్ జనరల్ మేనేజర్ సుజాత, సుబ్రహ్మణ్యంతో కలిసి ఎస్‌టీపీ ప్లాంటు ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. సరూర్‌నగర్ చెరువును సుందరంగా తీర్చిదిద్దడంతో పాటు మురుగు నేరుగా చెరువులోకి చేరకుండా మరో ప్లాంటు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీధర్‌గౌడ్, సుధీర్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, జూపల్లి ప్రవీణ్, రోహిత్‌రెడ్డి, శ్రవణ్‌గుప్తా, మనోజ్, నరేశ్, వెంకట్, రాజు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి



జోనల్ కమిషనర్‌తో మాట్లాడుతున్న పవన్‌కుమార్

నాగోలు: కొత్తపేట డివిజన్ పరిధిలో ఆర్‌బీఐ కాలనీలోని అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్, ఆర్‌బీఐ కాలనీ సంక్షేమ సంఘం నాయకులు సోమవారం జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్‌కు కలిసి వినతిపత్రం అందజేశారు. మోహన్‌నగర్ కాలనీకి స్ట్రామ్ వాటర్, సీసీ రోడ్డు పనులను సోమవారం కార్పొరేటర్ కాలనీవాసులతో కలిసి పరిశీలించారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలన్నారు. కార్పొరేటర్ వెంట రామిరెడ్డి, రాజశేఖర్, ప్రసాద్, మురళీకృష్ణ, వినోద్ ఉన్నారు.

రజతోత్సవ సభను విజయవంతం చేయాలి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

దిల్‌సుఖ్‌నగర్: వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో ఈ నెల 27న నిర్వహిస్తున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని మహేశ్వరం నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్ శర్మ పిలుపునిచ్చారు. సోమవారం ఆయన డివిజన్ అధ్యక్షులు పెండ్యాల నగేష్ ఆధ్వర్యంలో రజతోత్సవ సభకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధనే లక్ష్యంగా బీఆర్ఎస్ పార్టీ ఏర్పడిందని కేసీఆర్ ఒక్కడే గులాబీ జెండా చేతపట్టి ఊరూరు తిరిగి లక్షలాది మందిని ప్రజలను సమీకరించి పోరాడి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించారన్నారు. రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా కేసీఆర్ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో సాజిద్, నేలకొండ శ్రీనివాస్ రెడ్డి, రామాచారి, గొడుగు శ్రీనివాస్, కొంద్ర శ్రీనివాస్, మంత్రి రవీందర్ రావు, కంచర్ల శేఖర్, మహేందర్ రెడ్డి, శ్యాంగుప్తా, పెంబర్తి శ్రీనివాస్, వెంకటేష్ గౌడ్, జాహెద్ పాల్గొన్నారు.

అత్తపై కోడలు దాడి



రాములమ్మపై దాడి చేస్తున్న సంధ్యారాణి (సీసీ ఫుటేజీ)

నాగోలు: అత్తపై కోడలు దాడిచేసి గాయపరిచిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుల వివరాల ప్రకారం..నాగోలు బండ్లగూడ మధురనగర్ కాలనీలో పసుపులేటి రాములమ్మ(80) పసుపులేటి సంతోష్‌రెడ్డి దంపతులు ఉంటున్నారు. సంతోష్‌రెడ్డి అంధుడు. వీరి పెద్ద కుమారుడు వేణుగోపాల్‌రెడ్డి, భార్య సంధ్యారాణిల నడుమ ఐదేళ్లుగా గొడవలు జరుగుతుండడంతో వేర్వేరుగా ఉంటున్నారు. ఆస్తి విషయంలో ఇరువురు కోర్టును ఆశ్రయించారు. తనను అత్తింటి వారు ఇంట్లోకి రానివ్వడం లేదని సంధ్యారాణి కోర్టుకు ఆశ్రయించగా ఇంటికి వెళ్లొచ్చని ఆర్డర్ ఇచ్చింది. ఈ నెల18న సంధ్యారాణి కోర్టు ఇచ్చిన ఆర్డర్‌తో పాటు తన తరఫున అమందర్‌రెడ్డి, సురేందర్ రెడ్డి, యాదవరెడ్డి, నర్సిరెడ్డి, వెంకటేశ్వర్‌రావును వెంట బెట్టుకుని వెళ్లింది. అక్కడికి వెళ్లగానే సంధ్యారాణి అత్త మామలు కోర్టు ఇచ్చిన ఆర్డర్‌పై ఇంటి అడ్రస్ వేరుగా ఉందని వెళ్లిపోవాలని చెప్పారు. దీంతో ఆగ్రహానికి గురైన సంధ్యారాణి అత్తపై దాడి చేసింది. మామ సంతోష్‌రెడ్డి (80) అంధుడు పక్కనే తన భార్యపై కోడలు దాడి చేస్తున్న చూడలేని దయనీయ స్థితిలో ఉన్నాడు. దాడి సమయంలో రాములమ్మ అరుస్తుండగా సంధ్యారాణితో పాటు వచ్చిన వారు వెళ్లిపోయారు. ఈ క్రమంలో రాములమ్మ మెడ, నడుముగా గాయాలయ్యాయి. స్థానికుల సహాయంతో సాయినగర్‌లో హాస్పిటల్ రాములమ్మ చేరి చికిత్స పొందుతుంది. తన కోడలు హత్యాయత్నం చేసిందని ఈ విషయంపై నాగోలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే కోర్టులో ఉన్న విషయం పట్టించుకోవడం లేదని ఎల్‌బీనగర్ ఏసీపీ కృష్ణయ్యకు ఫిర్యాదు చేశారు. రాములమ్మపై దాడి చేసిన సీసీ ఫుటేజీని ఏసీపీకి అందజేశారు. ఏసీపీ కృష్ణయ్య కేసు నమోదు చేయాలని నాగోలు పోలీస్‌లను ఆదేశించారు.

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరల వివరాలు.. టమాటా రూ.15, వంకాయ రూ.18, బెండ రూ.35, పచ్చిమిర్చి రూ.40, కాకరకాయ రూ.38, బీరకాయ రూ.45, కాలిఫ్లవర్ రూ.18, క్యాబేజీ రూ.09, క్యారెట్ రూ.20, దొండ రూ.23, ఆలుగడ్డ రూ.26, ఉల్లిగడ్డ రూ.17, గోకరకాయ రూ.35, దోసకాయ రూ.18, సొరకాయ రూ.09, పొట్లకాయ రూ.18, అరటికాయ రూ.09, చిక్కుడుకాయ రూ.55, చామగడ్డ రూ.28, మునగ రూ.23, కందగడ్డ రూ.85, బీట్‌రూట్ రూ.15, కీర రూ.28 బీన్స్ రూ.65, క్యాప్సికమ్ రూ.40.

అధైర్య పడొద్దు



శైలజను సన్మానిస్తున్న దృశ్యం

చాదర్‌ఘాట్: ట్రాన్స్‌జెండర్స్‌కు గౌరవం ఇవ్వాలనే ఉద్దేశంతో ట్రాఫిక్ అసిస్టెంట్లుగా నియమించారని అధైర్య పడకుండా ముందుకు సాగాలని వికలాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్స్ సాధికారత రాష్ట్ర డైరెక్టర్ బి.శైలజ అన్నారు. సోమవారం మలక్‌పేటలోని వికలాంగుల సంక్షేమ భవనంలో ట్రాన్స్‌జెండర్ ట్రాఫిక్ అసిస్టెంట్లు డైరెక్టర్ శైలజను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శైలజ మాట్లాడుతూ.. భవిష్యత్‌లో రాష్ట్రంలోని 30 జిల్లాలకు ట్రాన్స్‌జెండర్స్‌ను ట్రాఫిక్ అసిస్టెంట్లుగా నియమించాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు ఉన్నాయన్నారు. త్వరలో హైడ్రాకు కూడా నియామకాలు జరిగేలా నగర కమిషనర్‌తో మాట్లాడుతానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ అరుణ, సూపరింటెండెంట్ అభివర్మ, ట్రాన్స్‌జెండర్స్ స్టేట్ కోఆర్డినేటర్ ప్రీతి సునంద, జయంతి పాల్గొన్నారు.

రాజీవ్ యువ వికాసానికి 1,28,000 దరఖాస్తులు

చాదర్‌ఘాట్: రాజీవ్ యువ వికాసానికి హైదరాబాద్ జిల్లా నుంచి 128000 దరఖాస్తులు వచ్చాయని వికలాంగుల సంక్షేమ శాఖ అధికారులు వెల్లడించారు. దివ్యాంగులకు ఆర్థిక పునరావాసం పథకం కింద వికలాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్ జిల్లా నుంచి 3000 దరఖాస్తులు వచ్చాయని దరఖాస్తుల పరిశీలన జరుగుతుందని హైదరాబాద్ ఏడీ రాజేందర్ తెలిపారు.

పేద క్రీడాకారిణికి చేయూత



కావ్యను సత్కరిస్తున్న సూపరింటెండెంట్

చంచల్‌గూడ: సేవ్ ద గర్ల్ చైల్డ్ సంస్థ పేద విద్యార్థులు, ప్రతిభావంతులకు చేయూతనిస్తుందని చంచల్‌గూడ జైలు సూపరింటెండెంట్ నవాబు శివకుమార్ గౌడ్ అన్నారు. సూర్యాపేటకు చెందిన గుగులోత్ కావ్యశ్రీ క్రికెట్‌లో ప్రతిభ కనబరుస్తుంది. ఆమె అండర్–19 జాతీయ జట్టులో సభ్యురాలు. సోమవారం సూపరింటెండెంట్‌ను మర్యాదపూర్వకంగా కలువగా ఆమెను శాలువాతో సత్కరించిన ఆయన రూ. 70 వేలు విలువ చేసే క్రికెట్ కిట్‌ను అందజేశాడు.

బహుమతుల ప్రదానం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఆకెళ్ల రాఘవేంద్ర

చైతన్యపురి: సిప్ అబాకస్ చైతన్యపురి బ్రాంచిలో అబాకస్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు ఆకెళ్ల రాఘవేంద్ర, సైకాలజిస్ట్ వేలూరి పల్లవి బహుమతులు అందజేశారు. సిప్ అబాకస్ 18వ వార్షికోత్సవం సందర్భంగా అన్ని లెవెల్స్ శిక్షణ పూర్తి చేసుకున్న 30 మంది విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఇప్పటి వరకు సుమారు 5000 మంది విద్యార్థులు శిక్షణ పూర్తి చేసుకుని వివిధ రంగాల్లో రాణించారని నిర్వాహకులు సరియ జయంత్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రవీణ్, లావణ్య, జ్యోతి, సృజన, మాధురి, కల్పన, అమృత, వాణి, రూప, స్వప్న, స్వాతి పాల్గొన్నారు.

విద్యార్థులు శ్రద్ధతో చదువుకోవాలి



పట్టాలు అందజేస్తున్న రామారావు

నాగోలు: విద్యార్థులు ఉపాధ్యాయులు చెప్పిన విషయాలు శ్రద్ధగా విని అర్థం చేసుకోవాలని ఉప్పల్ మండల విద్యాధికారి రామారావు అన్నారు. జైపురి కాలనీ డివిజన్ పరిధిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఐదవ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులకు నిర్వహించిన వీడ్కోలు సమావేశంలో రామారావు పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు చిన్నప్పటి నుంచే క్రమశిక్షణ అలవర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ మేడ్చల్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రామేశ్వర్ గౌడ్, ఆనంద్ రెడ్డి, నాగోలు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు లక్ష్మీదేవి, ప్రధానోపాధ్యాయులు బత్తుల శ్రీనివాస్ రెడ్డి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్ పర్సన్ వరలక్ష్మి, ఉపాధ్యాయులు అనంతరెడ్డి, మేరీ బ్యూల, రమాదేవి, సుధారాణి పాల్గొన్నారు.

ఆ గ్యాస్ ఏజెన్సీపై చర్యలు తీసుకోవాలి



ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్న శ్రీనివాస్‌గౌడ్

మన్సూరాబాద్: కార్మికులకు జీతాలు ఇవ్వకుండా శ్రమ దోపిడీకి పాల్పడుతున్న వనస్థలిపురంలోని శ్రీషిరిడీ సాయి ఇండేన్ గ్యాస్ ఏజెన్సీపై చర్యలు తీసుకోవాలని కుకింగ్ గ్యాస్ డెలివరీ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు నకిరేకంటి శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత పదేళ్లుగా గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు కార్మికులకు జీతాలు ఇవ్వడం లేదని నిలదీస్తే తీసేస్తామని బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. కార్మికులకు చట్టప్రకారం ఇచ్చే ఐడీ కార్డులు, ఈఎస్ఐ, పీఎఫ్‌లు కల్పించడం లేదని పేర్కొన్నారు. రాజకీయ పలుకుబడితో కార్మికుల శ్రమ దోపిడీకి పాల్పడుతూ వినియోగదారులకు భారం వేస్తున్నారని విమర్శించారు. కార్మిక చట్టాలను ఉల్లంఘిస్తున్న గ్యాస్ ఏజెన్సీపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సోమవారం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు.

అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న సుజాతానాయక్

హస్తినాపురం: డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ అన్నారు. వివిధ ప్రాంతాల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను ఆమె పరిశీలించి మాట్లాడారు. బస్తీలు, కాలనీల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనుల్లో స్థానికులు భాగస్వామ్యం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, మమత, మల్లేశ్‌గౌడ్, వివిధ కాలనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

మల్లీశ్వరి కుటుంబానికి న్యాయం చేయాలి



ధర్నా చేస్తున్న నాయకులు

నాగోలు: ధర్మారపు మల్లీశ్వరి కుటుంబానికి న్యాయం చేయాలని ధర్మ సమాజ్ పార్టీ(డీఎస్పీ) రాష్ట్ర కమిటీ నాయకులు ప్రసాద్ డిమాండ్ చేశారు. సోమవారం మల్లీశ్వరికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ డీఎస్పీ ఆధ్వర్యంలో ఎల్‌బీనగర్‌లో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నల్గొండ జిల్లా, నిడమనూరు మండలం, బొక్కమంతలపాడ్ గ్రామంలో దళిత బిడ్డ, మల్లీశ్వరిని ప్రేమించి పెళ్లి చేసుకుంటానని మోసం చేసి ఆమె మరణానికి కారణమైన అదే గ్రామానికి చెందిన కుక్కల జానారెడ్డితో పాటు మరికొంత మంది అగ్రకుల పెద్దలు ఆమెకు న్యాయం చేస్తామని నమ్మించి మోసం చేశారని మండిపడ్డారు. కుల దురహంకారంతో ఆమెను మానసికంగా వేధించి, ఆత్మహత్య చేసుకునేలా ప్రేరేపించి ఆమె మరణానికి కారకులైన ప్రతి ఒక్కరిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాలో రాజ్‌కమల్, కార్తీక్, రాంబాబు, వినోద్ యాదవ్, అబ్దుల్ రెహమాన్, రాఘవేంద్ర ముదిరాజ్, దాసోజు లలిత, కొండ లలిత, సేవాలాల్ సేన కన్వీనర్ రాంబాబు నాయక్ పాల్గొన్నారు.

చోరీలకు పాల్పడుతున్న పాత నేరస్తుడి రిమాండ్



స్వాధీనం చేసుకున్న వాహనాలు నిందితుడు బాలరాజు

నాగోలు: జల్సాలకు అలవాటు పడి ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడున్న పాత నేరస్తుడిని ఎల్‌బీనగర్ పోలీసులు రిమాండ్‌కు తరలిరంచారు. సీఐ వినోద్‌కుమార్ వివరాల ప్రకారం..కామారెడ్డి జిల్లా, సదాశివనగర్ మండలం, పోసాని పేటకు చెందిన కమ్మరి బాలరాజు అలియాస్ సన్నోతుల బాలరాజు(50) ఎల్‌బీనగర్‌లోని మైత్రీనగర్‌లో ఉంటూ వడ్రంగి పని చేసుకుంటున్నాడు. జల్సాలు, చెడు వ్యసనాలకు అలవాటు పడి ద్విచక్ర వాహనలను చోరీలకు పాల్పడుతున్నాడు. గతంలో చోరీ కేసుల్లో జైలుకు వెళ్లి వచ్చాడు. వివిధ ప్రాంతాల్లో పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాల చోరీకి పాల్పడ్డాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు సోమవారం బాలరాజును అదుపులోకి తీసుకుని 10 ద్విచక్ర వాహనలను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.

నిషా కోసం పెయిన్ కిల్లర్

- డోస్ ఎక్కువై యువకుడి మృతి
- ఆస్పత్రిలో మరో ఇద్దరు



మహ్మద్ అబ్దుల్ నాసర్ (ఫైల్)

పహాడీషరీఫ్: మత్తు కోసం పెయిన్ కిల్లర్‌ను అలవాటు చేసుకున్న యువకుడు, మరింత నిషా కోసం డోస్ పెంచి మృత్యువాత పడిన ఘటన బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సుధాకర్ వివరాల ప్రకారం.. సుల్తాన్‌పూర్‌కు చెందిన ఎంఎస్ కళాశాల ప్రథమ సంవత్సరం విద్యార్థి మహ్మద్ అబ్దుల్ నాసర్(17), షాబాజ్(22), మరో బాలుడు స్నేహితులు. వీరు కొన్ని నెలలుగా మత్తు కోసం పెయిన్ కిల్లర్ టాబ్లెట్లు తీసుకుంటున్నారు. వీటిని ఎలా వాడాలనే విషయమై షాహిన్‌నగర్‌కు చెందిన సాహిల్ అనే మరో వ్యక్తి సాయం తీసుకుంటున్నారు. మొదట్లో కొద్ది స్థాయిలో పెయిన్ కిల్లర్లను తీసుకున్న యువకులు మరింత నిషా కోసం మోతాదును మించి తీసుకోవడం ప్రారంభించారు. ఈ క్రమంలో ఈ నెల 17న ముగ్గురూ కలిసి పెయిన్ కిల్లర్లను తీసుకున్నారు. నాసర్ కోమాలోకి వెళ్లడంతో కుటుంబ సభ్యులు అతన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతిచెందాడు. మిగిలిన ఇద్దరు ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

మహిళా కానిస్టేబుల్ ఆత్మహత్య



దీపిక (ఫైల్)

మీర్‌పేట: ఓ మహిళా కానిస్టేబుల్ ఆత్మహత్య చేసుకున్న ఘటన మీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. హస్తినాపురం టీచర్స్ కాలనీలో నివసించే ఆకుల దీపిక (38) రెండున్నరేళ్లుగా నాగోలు స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తోంది. ఆమెకు భర్త రవి కుమార్, కుమారుడు, కుమార్తె ఉన్నారు. సోమవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. దీపిక ఆత్మహత్యకు ఆర్థిక ఇబ్బందులా.. మరేమైనా కారణాలు ఉన్నాయా అనేది తెలియరాలేదు. తండ్రి సుధాకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ నాగరాజు తెలిపారు.